



కడుపు కోత ఆగేనా?



- ప్రైవేట్ ఆస్పత్రుల్లో కానరాని సాధారణ ప్రసవాలు
- జిల్లాలో 90 శాతం సిజేరియన్లే
- కాసుల కోసం ఇష్టారాజ్యంగా ఆపరేషన్లు
- సీఎం చంద్రబాబు హెచ్చరికతోనైనా మార్పు వస్తుందా?



● రాష్ట్రంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇది మంచి పద్ధతి కాదు. భగవంతుడు ఇచ్చిన సహజ సిద్ధమైన శరీరాన్ని కోతకు గురిచేయడం సరికాదు. డెలివరీ డేట్ నెల ముందే చెబుతున్నారు. ముహూర్తం పెడుతున్నారు.. ఇది చాలా తప్పు. ప్రమాదకర ధోరణి. డాక్టర్లు డబ్బుల కోసం సిజేరియన్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిస్థితి ఇకపై ఉండకూడదు.

-ఈ నెల 21న అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పార్వతీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రసవాల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న గర్భిణులకు కడుపు కోత తప్పడం లేదు. సాధారణ ప్రసవానికి వీలున్నప్పటికీ కాసుల కోసం జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు గర్భిణులకు ఆపరేషన్లు చేసి డెలివరీ చేస్తున్నాయి. ఉమ్మనీరు తక్కువగా ఉందని, బిడ్డ అడ్డంగా తిరిగిందని, గుండె వేగంగా కొట్టుకొట్టోందని గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను వైద్యులు భయపెట్టి ఆపరేషన్లకు అంగీకరించేలా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొందరు తల్లిదండ్రులు మాత్రం మంచి ముహూర్తాలు చూసుకుని కోరుండి సిజేరియన్ చేయాలని వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు పాలకొండ, సాలూరు తదితర మండలాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులు ఆపరేషన్ల కోసం అత్యధిక సొమ్ము డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇంచుమించుగా సగానికి సగం ప్రసవాలు సాధారణంగానే జరుగుతున్నాయి. అయినా సరే అధిక శాతం గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీనికి ప్రభుత్వ ఆసుపత్రుల సేవలపై నమ్మకం లేకపోవడమే కారణం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోయినా చాలామంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్న పరిస్థితి జిల్లాలో ఉంది. అదేవిధంగా ఎన్టీఆర్ వైద్య సేవా పథకం పొందలేని వారు సిజేరియన్లకు పెద్ద ఎత్తున నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వారి ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా తల్లి, బిడ్డ ప్రాణాల కోసం అప్పులు చేసి మరీ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేయించుకుంటున్న పరిస్థితి నెలకొంది. కొందరు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆర్ఎంపీలు కమీషన్లకు ఆశ పడి గర్భిణులను ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకువెళుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎక్కువ ప్రసవాలు సిజేరియన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. ప్రధానంగా ఒడిశా రాష్ట్రం రాయఘడ తదితర ప్రాంతాల (మిగతా 6వ పేజీలో..)

90 శాతంపైనే సిజేరియన్లు

జిల్లాలో 90 శాతం పైబడి సిజేరియన్లు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు 20 వరకు 20 మంది గర్భిణులు ప్రసవాలకు వెళ్లగా అందులో 17 సిజేరియన్లు జరిగాయి. మరొక ఆసుపత్రికి 15 మంది గర్భిణులు వెళ్లగా 11 ఆపరేషన్లు జరిగాయి. ఇంకొక ఆసుపత్రిలో 21 మంది గర్భిణులు కాన్పు కోసం వెళ్లగా అందులో 17 మందికి వైద్యులు ఆపరేషన్లు చేసి శిశువులను తీశారు.

మరోసారి ఫస్ట్ ర్యాంకు

- ఆశావహ జిల్లాగా రెండోసారి ఎంపికైన మన్యం
- సమన్వయంతోనే ఇది సాధ్యమైందన్న కలెక్టర్



పార్వతీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా మరోసారి ఫస్ట్ ర్యాంకు సాధించింది. నీతిఅయోగ్ గురువారం ప్రకటించిన జోన్-3 డెల్టా ర్యాంకింగ్‌లో 2025 జూన్ మాసానికి దక్షిణ భారతదేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆశావహ జిల్లాగా వరుసగా రెండోసారి పార్వతీపురం ఎంపిక కావడంపై కలెక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమన్వయంతో ఏదైనా సాధ్యమవుతుందని మరోసారి అధికారులు నిరూపించారన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రతి బ్లాక్ స్థాయి అధికారికి శుభాకాంక్షలు తెలిపారు. పూర్తిగా పీవీటీజీ జనాభా ఉన్న ప్రాంతంలో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు వంటి 12 కీలక సామాజిక రంగాల సూచికలను నీతి అయోగ్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. జిల్లాకు సంబంధించి నిరంతరం అభివృద్ధి సూచికలను పెంచుతూ, మనుమకొండ ఆదర్శ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడం ద్వారా ఫస్ట్ ర్యాంకులో నిలిచిందన్నారు. నీతిఅయోగ్ ర్యాం కింగ్‌తో జిల్లాకు రూ.1.50 కోట్ల రివార్డు వస్తుందన్నారు. ఇప్పటివరకు రెండుసార్లు మొదటి స్థానం సాధించడం ద్వారా మొత్తం రూ.3 కోట్లు వచ్చాయని అన్నారు.

పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు

- భయం గుప్పెట్లో గ్రామాలు



భామిని: సన్నాయిగూడ సమీప పొలాల్లో ఏనుగులు

పార్వతీపురం రూరల్/భామిని, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, భామిని మండలాల్లో ఏనుగుల గుంపు బెంబేలెత్తిస్తోంది. బుధవారం అర్ధరాత్రి పార్వతీపురం మండలం పెదమరికి, చిన్నమరికి, బండిదొరవలస గ్రామాల పరిసర ప్రాంతాల్లో కె.గౌరునాయుడుకు చెందిన మొక్కజొన్న పంట, చంద్రమౌళి, జి.గిరి పట్నాయక్‌కు చెందిన వరి పంటలను అవి ధ్వంసం చేశాయి. అలాగే భామిని మండలం సన్నాయిగూడ సమీపంలోని పొలాల్లో కూడా నాలుగు ఏనుగులు గురువారం సంచరించాయి. దీంతో ఇసుకగూడ, సన్నాయిగూడ, డోకులగూడ గిరిజనులు పొలం పనులకు వెళ్లేందుకు భయపడ్డారు. ఏనుగులు పల్లపు ప్రాంతాలకు రాకుండా అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఓటర్లకు సమీపంలో పోలింగ్ స్టేషన్

- జిల్లా రెవెన్యూ అధికారి హేమలత



మాట్లాడుతున్న డీఆర్వో హేమలత

పార్వతీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు నివాసం ఉండే ప్రాంతం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో పోలింగ్ స్టేషన్ ఉండే విధంగా చర్యలు చేపడతామని జిల్లా రెవెన్యూ అధికారి హేమలత తెలిపారు. ట్బాల్సి ఉందన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఆవశ్యకత తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె తన కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. పోలింగ్‌బూత్‌లో 800 నుంచి 1200 మంది ఓటర్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. వచ్చే రెండు నెలల్లోపు పోలింగ్ స్టేషన్లను విలీనం చేయడం లేదా ఓటరును సమీప పోలింగ్ స్టేషన్‌కు మార్చడం తదితర అంశాలపై కసరత్తు చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజానికి ఒక గంట
సేవ చేయండి
5లో

102 చెరువు పనులకు
రూ.56కోట్లతో
ఆమోదం
5లో

సారా తయారీ
కేంద్రాలపై దాడులు
● 730 లీటర్లు స్వాధీనం
● 9,700 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం
5లో

వెబ్‌ల్యాండ్‌లో
తప్పులు
సరిచేయండి
6లో

కల సాకారమైన వేళ

- కొత్త గురువులకు నియామక పత్రాలు
- అందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



పీఈటీగా ఎంపికైన విజయనగరానికి చెందిన రెడ్డి కృష్ణకు నియామకపత్రం అందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

సాలూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్త ఉపాధ్యాయుల కల సాకారమైంది. విజయవాడలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నుంచి వారు నియామకపత్రాలు అందుకున్నారు. ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉమ్మడి జిల్లాకు చెందిన 578 మంది టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. వీరంతా నియామక పత్రాలు అందుకునేందుకు మోదవలస నుంచి బుధవారం 40 బస్సుల్లో విజయవాడకు బయల్దేరారు. తమ కల సాకారమైందని, ముఖ్యమంత్రి నుంచి నియామకపత్రాలు అందుకోవడం ఆనందంగా ఉందని కొత్త టీచర్లు తెలిపారు.

ఆనందంగా ఉంది..



మెగా డీఎస్సీని కూటమి ప్రభుత్వం నిర్వహించడంతో నేను టీచర్‌గా ఉద్యోగం సాధించాను. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు రుణపడి ఉంటా. కూటమి ప్రభుత్వం చెప్పినట్టే నిరుద్యోగులను ఆదుకుంది. నా భర్త తాళ్లపూడి శ్రీరాములు నాయుడు ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాను. ఇద్దరి ఆడపిల్లలతో ఇంటి బాధ్యతలు నిర్వహిస్తూనే చదివాను. కష్టపడిన దానికి ఫలితం దక్కింది.

-తాళ్లపూడి భారతి, గరుడబిల్లి, బొండపల్లి మండలం

ప్రభుత్వానికి ధన్యవాదాలు..



మంత్రి సంధ్యారాణికి నియామకపత్రం చూపిస్తున్న దుర్గాప్రసాదరావు

చెప్పినట్టే సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ నిర్వహించింది. నోటిఫికేషన్ ప్రకటించిన 150 రోజుల్లో ఎంపిక జాబితాను సైతం వెల్లడించి ఈ రోజు నియామక పత్రాలందించారు. కూటమి ప్రభుత్వం చొరవతో మెగా డీఎస్సీ నిర్వహించిన దానిలో నాకు గిరిజన సంక్షేమశాఖలో తెలుగు టీజీటీగా ఉద్యోగం వచ్చింది. కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్ర బాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు. కుటుంబం ఇచ్చినా ఆసరాతో ఉద్యోగం సాధించాను.

-బూరగాన దుర్గాప్రసాదరావు, పార్వతీపురం

ఎంతో సంతోషంగా ఉంది..



రూపవతి

వీరఘట్టం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉద్యోగానికి ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని జి.రూపవతి తెలిపారు. 'నేను వీరఘట్టం మండలం నడిమికెల్ల సచివాలయ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నా. ఒకపక్క విధులు నిర్వహిస్తూనే మరోపక్క ఉపాధ్యాయ ఉద్యోగంపై మక్కువతో కష్టపడి చదివి పోస్టు సాధించి'నట్లు రూపవతి తెలిపారు.

హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు..

పార్వతీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో గురువారం నిర్వహించిన నూతన ఉపాధ్యాయుల నియామకపత్రాల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కోనేరు ఆవరణలో చెత్త తొలగిస్తున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, తదితరులు

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్తవలస నవదుర్గా కోనేరు వద్ద గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కోనేరు పరిసరాల్లో ఉన్న చెత్తా చెదారం, గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాల్లో జీవిస్తున్న ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. విద్యావంతులు, మేధావులు పర్యావరణ పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో (మిగతా 6వ పేజీలో..)

సరికొత్తగా 108 వాహనాలు

సాలూరురూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా రోడ్డు ప్రమాదానికి గురైనా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న మొదటగా గుర్తుకొచ్చేది 108 అంబులెన్స్. ఫోన్ చేసిన వెంటనే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి వారి ప్రాణాలను కాపాడేలా చేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ వాహనాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. నేషనల్ కలర్ కోడ్‌కు భిన్నంగా 108 అంబులెన్స్‌లకు నీలం రంగు వేసింది. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ వాహనాలకు కొత్త సొబగులు అద్దుతోంది. నీలం రంగు స్థానంలో పసుపు, ఎరుపు, తెలుపు రంగులు వేసి సరికొత్తగా మారుస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 45 వాహనాలు ఉన్నాయి. పార్వతీపురం జిల్లాలో 17 వాహనాల్లో 86 మంది సిబ్బంది, విజయనగరం జిల్లాలో 28 వాహనాల్లో 140 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 108 సేవలకు విఘాతం లేకుండా వారానికి రెండు వాహనాలకు రంగులు మార్చేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పార్వతీపురంలో 15, విజయనగరంలో 20 వాహనాలకు రంగు లు మార్చి వినియోగిస్తున్నారు. మిగిలిన వాహనాలకు కొద్దిరోజుల్లో రంగులు మార్చనున్నారు. కాగా, గతేడాది సెప్టెంబరు నుంచి ఈ ఏడాది ఆగస్టు 31 వరకు పార్వతీపురం జిల్లాలో 17 వాహనాలు 23,400 కేసులకు, విజయనగరం జిల్లాలో 28 వాహనాలు 36,650 కేసులకు హాజరై సేవలందించాయి.

రంగులు మార్చుతున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు 108 వాహనాలకు రంగులు మార్చుతున్నాం. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇప్పటికే 35 వాహనాలకు రంగులు మార్చాం. ప్రభుత్వ సూచన మేరకు నేషనల్ కలర్ కోడ్‌ను అనుసరించి అంబులెన్స్‌లకు రంగులు వేస్తున్నాం. రంగుల వల్ల వాహనాల స్ట్రక్చర్‌కు రక్షణ ఏర్పడుతుంది. సేవలకు విఘాతం కలగకుండా వారానికి రెండు వాహనాలకు రంగులు మార్చుతున్నాం.

- ఎస్. మన్మథనాయుడు, 108 వాహనాల ఉమ్మడి జిల్లా మేనేజర్





కాత్యాయనిదేవి అలంకరణలో..

కాత్యాయనిదేవిగా కోటదుర్గమ్మ

పాలకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నవరాత్రి అవతారాల్లో భాగంగా అమ్మవారు గురువారం శ్రీకాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ, అర్చకులు మణీల్ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు, పుష్పాభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

డ్రోన్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట

- ఎస్పీ మాధవరెడ్డి



సమీక్షిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్షను ఎస్పీ వర్చువల్‌గా నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, చీటింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి వంటి నిషేధిత పదార్థాల అక్రమణ (మిగతా 6వ పేజీలో..)



నేటి నుంచి డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ

చీపురుపల్లి, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం రెండో విడత ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం అవుతుందని ప్రిన్సిపాల్ పీవీ కృష్ణాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగల్ మేజర్ విధానంలో బీఎస్సీలో గణితం, ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సు, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, బీఏ పొలిటికల్ సైన్సు, ఎమ్మెస్సీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సు కోర్సులు ఉన్నాయని చెప్పారు. పూర్తి వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ మహిళలకు శిక్షణ

విజయనగరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ మహిళా సాధికారిత శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మహిళా ప్రాంగణం మేనేజరు బీఆర్ శ్యామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 రోజుల పాటు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, 45 రోజుల పాటు ఎంబ్రాడయిరీ కోర్సు, జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు గల వారు అర్హులని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 26 లోగా శిక్షణ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కనీస వేతనం ఇవ్వాలి

రాజాం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్లకు రూ.15 వేలు కనీసవేతనంగా అమలుచేయాలని ఆ సంఘ నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మన్లకు కనీస వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పైడితల్లి హుండీ ఆదాయం రూ.3.10లక్షలు

రాజాం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి హుండీలు, ముడుపుల ద్వారా 134 రోజులకు రూ.3లక్షల 10వేల 825 ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో బీవీ మాధవరావు తెలిపారు. నవదుర్గ అమ్మవారి దేవస్థానం ఈవో శ్యామలరావు, దేవదాయశాఖ అధికారులు, వంశపారంపర్య ధర్మకర్త దుర్గాప్రసాద్, తదితరుల సమక్షంలో గురువారం హుండీలను తెరిచి లెక్కించామని ఈవో చెప్పారు.

ఎస్పీ బాలుకు నివాళి

గరివిడి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా గురువారం గరివిడిలోని సహాయ పార్క్, టీచర్స్ కాలనీలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వాకడ శ్రీను, సహాయ్ అధ్యక్షుడు యు.శ్రీను, బొద్దూరి శంకరరావు, బలగ అప్పారావు, సిరిది రాంబాబు, పక్కి శ్రీను, కల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖాదర్‌బాబా జయంతి వేడుకలు

విజయనగరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాబామెట్టలోని ప్రముఖ సూఫీ క్షేత్రం హజరత్ బాబా సయ్యద్ ఖాదర్ షా వలీ దర్గా దర్బార్ మతవల్లీలో శుక్రవారం ఖాదర్‌బాబా 129వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు దర్గా వ్యవస్థాపకులు ఏటీకే-వెలుగు అనాథ వృద్ధాశ్రయం వ్యవస్థాపకుడు డా.మహ్మద్ ఖలీలు బాబు తెలిపారు. ఈ జయంతి మహోత్సవానికి విచ్చేయవలసిందిగా కోరుతూ కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి ఆయన గురువారం ఆహ్వానపత్రికను అందించారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు.

ఆక్రమణ చేశారని ఫిర్యాదు

పూసపాటిరేగ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కోనాడ గ్రామంలో గల టీడీపీ నాయకుడు దంగా భూలోకపై ఆ గ్రామంలో గల జనసేన పార్టీ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 36 సెంట్ల విస్తీర్ణం కలిగిన ఒక కుంటను భూలోక ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్నారని వారు తెలిపారు. అదేవిధంగా పక్కనే ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేస్తున్నారన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో బొడ్డు ఎల్లాజీ, విజ్జపు కిరణ్, పిన్నింటి అప్పలనారాయణ తదితరులు ఉన్నారు.

వరద ఉధృతిపై అప్రమత్తం

మెంటాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపావతి నది ఉధృతిపై తహసీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందాలు అప్రమత్తమయ్యాయి. నదిలో నుంచి ఆగూరు, రెల్లిగూడెం గ్రామాలకు వెళ్లకుండా రాకపోకలు కట్టడి చేశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరూ నదిలో ఎవరూ దిగకుండా గురువారం ముళ్లకంచెలు వేయించామని చెప్పారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మెరకముడిదాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాతాంవలస గ్రామంలో గురువారం ఉద్యాన శాఖ, రాదిక ఆయిల్ కంపెనీ సంయుక్తంగా రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా చీపురుపల్లి ఉద్యాన శాఖాధికారి ఎం.అనూష మాట్లాడారు. ఆయిల్‌పామ్ మొక్కలను శాతశాతం రాయితీపై ఉచితంగా రైతులకు అందజేస్తామన్నారు. అలాగే ఒక హెక్టారు ఆయిల్‌పామ్ సాగుకు గరిష్టంగా రూ.29వేలు సబ్సిడీ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సరస్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- వినూత్నంగా పుష్పప్రదర్శన
- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశాలు

విజయనగరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న ప్రారంభం కానున్న అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్-2025)కి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సరస్, ఫలపుష్ప ప్రదర్శన కోసం మాన్సాస్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. సందర్శకులు ఇబ్బంది పడకుండా చూడాలని, ముఖ్యంగా వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. డ్వాక్రా సంఘాలు ఉత్పత్తి చేసిన వస్తువుల ప్రదర్శనలు, అమ్మకాలు సజావుగా జరగాలన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, ఎలక్ట్రికల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఎంహెచ్‌వో జీవనరాణి, ఉద్యానవన శాఖ జేడీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

102 చెరువు పనులకు రూ.56కోట్లతో ఆమోదం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ ద్వారా రిపేర్, రెనోవేన్, రెస్టొరేషన్(ఆర్‌ఆర్‌ఆర్) కింద రూ.56 కోట్ల అంచనాతో 102 చెరువు పనులకు ఆమోదం లభించిందని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన ఆధ్వర్యంలో ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ నిబంధనలు అనుసరించి జిల్లాలో ఉన్న 7,900 చెరువులు ఉండగా వాటిలో కేవలం 102 చెరువు పనులకే ప్రతిపాదనలు పంపడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలాల వారిగా ఉన్న చెరువులను పరిశీలించి ఈ నిబంధనల కిందకు వచ్చే వాటిని గుర్తించి మరిన్ని ఎక్కువ చెరువులను అభివృద్ధికి కృషి చేయాలని జల వనరులు శాఖ అధికారులకు ఆయన ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ నిబంధనలలోనికి రాని చెరువులు ఏ కారణంగా ఈ పరిధిలోకి రాలేదో కారణాలను కూడా వివరించాలన్నారు. వచ్చే వారానికి మరో 500 చెరువులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జలవనరులు ఈఈ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయం పనులను వేగవంతం చేయాలి

కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం నిర్మాణం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో నిర్మితమవుతున్న గిరిజన విద్యాలయం పనులపై గురువారం తన చాంబర్‌లో ఆయన అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 1.3 కిలో మీటర్ల మేర ప్రతిపాదించిన యూనివర్సిటీ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న విద్యుత్ హైటెషన్ వైర్లు, గేటు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెలుపలికి జరిపేందుకు చర్యలు ప్రారంభించాలని, ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నత అధికారులకు లేఖ రాయాలని సూచించారు. తాగునీటిని సరఫరా చేసే నిర్మాణాలన్ని పూర్తయ్యాయని, పంప్ హౌస్‌లకు విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి తదితరులు ఉన్నారు.

గిరిశిఖర వాసులకు రోడ్డు సదుపాయం కల్పించండి

శృంగవరపుకోట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిశిఖర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు రవాణా సదుపాయం కల్పించాలని స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజు గురువారం శాసన మండలిలో ప్రస్తావించారు. రేషన్ బియ్యం కూడా కింది నుంచి నెత్తిన మోసుకుని ఇంటికి తీసుకువెళ్తున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ గిరిజన గ్రామాలకు రోడ్లు మంజూరవుతున్నాయని, కానీ సకాలంలో పూర్తి కావడం లేదన్నారు. గిరిజనులకు ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు త్వరితగతిన రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

సిరిమానుకు పూజలు

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 25: పైడిమాంబ సిరిమాను, ఇరుసు మానులకు గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసమైన హుకుంపేట వద్ద ఆ మానులను సిరిమానుకు, ఇరుసులకు సంబంధించిన చెక్కుడు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు భక్తులు చేరుకుని, పూజలు చేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యూనియన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆ బ్యాంకు జీఎం శాలిని మీనన్ అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నగరంలోని యూనియన్ బ్యాంకు కంటోన్మెంట్ బ్రాంచ్ వద్ద ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం ఆమె కార్ కార్నివాల్ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీరేట్లకు కార్లపై రుణాలు అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకు ఆర్ఎం జితేంద్ర శర్మ, డిప్యూటీ ఆర్ఎంలు శ్రీనివాస్, రాజా, వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా అందాలి

మెరకముడిదాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా అందాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు అన్నారు. భైరిపురం సచివాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. యూరియా పంపిణీపై సిబ్బందిని ఆరా తీశారు. ఎంపీడీవో సుధాకర్ పట్నాయక్, తహసీల్దార్ సులోచనరాణి, ఏవో శ్రావణ్ తేజ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీరాములునాయుడు, గర్భాం పంచాయతీ ఈవో విశ్వనాథం పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం

మెరకముడిదాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్సీ భవనంలో సెమిస్టరు-2, ఎన్టీ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు ఎంఈవో-2 ధర్మ శ్రీను గురువారం తెలిపారు. ఎస్ఆర్‌కేవీఎం-1లో భాగమైన 1 నుంచి 10వ తరగతి వరకు 33 టైటిల్స్‌కుగానూ 20 టైటిల్స్ మండల కేంద్రానికి జిల్లా కేంద్రం నుంచి చేరాయని ఆయన చెప్పారు. మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల రోల్ ప్రకారం టైటిల్స్‌ను తరగతి వారీగా వేరుచేసి పంపిణీకి సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఎన్టీ పుస్తకాలను దసరా సెలవుల అనంతరం పాఠశా లలకు పంపిణీ చేస్తామన్నారు. మిగతా 10 టైటిల్స్‌ను కూడా జిల్లా నుంచి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు.

ముత్యాలమ్మకు పసుపు కుంకుమలు

వేపాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొండ గంగుబూడి శివారు సీతారాంపురం గ్రామస్థులు గ్రామ దేవత ముత్యాలమ్మకు గురువారం వారాల పండగను పురస్కరించుకుని పసుపు కుంకుమలు సమర్పించారు. ప్రతిఏటా వరినాట్లు పూర్తయిన తర్వాత ఈ పండగను నిర్వహిస్తూ ఉంటారు. ఈసందర్భంగా నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.


కోలాటం ఆడుతున్న దృశ్యం

సమాజానికి ఒక గంట సేవ చేయండి


విజయనగరం రూరల్: రైతు బజారులో చీపురుతో ఊడ్చుతున్న మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్



పూసపాటిరేగ: శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థినులు, ఉపాధ్యాయులు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా ఐ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని రింగురోడ్డు రైతు బజారులో గురువారం శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ బి.రవికిరణ్ అక్కడ రైతులతో కలిసి చీపురు పట్టుకుని రైతు బజారును శుభ్రపరిచారు. స్వచ్ఛతా ఐ సేవా కార్యక్రమంలో ఏక్ దిన్ ఏక్ గంటా, ఏక్ సాథ్ నినాదంతో అందరూ సమాజానికి రోజుకి ఒక గంటైనా సేవ చేయాలని ఆయన సూచించారు. ఎస్టేట్ ఆఫీసర్లు ఉమా, సతీష్, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రతపై అవగాహన

పూసపాటిరేగ: స్వచ్ఛ దివస్‌ను పురస్కరించుకుని స్థానిక కోనాడ జంక్షన్ వద్ద గల ఆర్డర్ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థినులు గురువారం కొత్తకొప్పెర్ల గ్రామంలో చెత్తను ఏరే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పలు చోట్ల ఉన్న చెత్తను ఏరి.. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్యామలరావు, ఉపాధ్యాయులతో పాటు స్థానిక సర్పంచ్ ఎస్.సత్తిబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, ఉప సర్పంచ్ ఎల్.రాజారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

డెంకాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వరి యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ప్రతి రైతూ తమ వరి పొలాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, వరిపంటపై వచ్చే సుడిదోమ అతి ప్రమాదకరమని విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విజయనగరం డివిజన్ ఏడీఏ నాగభూషణరావు, డెంకాడ మండల వ్యవసాయాధికారి సంగీత, శాస్త్రవేత్తల బృందంతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటలో ఎక్కువగా ఎర్రబడడం గమనించామని, ఇది పొటాష్ లోపంగా గుర్తించామన్నారు. కొన్ని చోట్ల నత్రజని లోపం కూడా గుర్తించినట్టు తెలిపారు. దీని నివారణకు ఎకరా వరి పొలానికి యూరియా 30 కిలోలు, పొటాష్ 15 నుంచి 20 కిలోలు కలిపి వేయాలన్నారు. వరిపంటలో అక్కడక్కడా దోమపోటు గమనించామని, దీని నివారణకు ఒక లీటరు నీటికి బుప్రోఫెజిన్ 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలని ఆయన వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు, పాణిరాజు, శ్రీకాకుళం వ్యవసాయ పరిశోధన కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కీలక తీర్మానాలు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ మండల సంఘం కీలక తీర్మానాలు చేసింది. గురువారం స్థానిక సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ కొడూరు శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. ఎస్.కోట మండల పరిధిలో కొత్త సెలూన్ ఏర్పాటుకు మండల సంఘం అనుమతి, ఈ దుకాణాల్లో పనిచేసేవారు మండల పరిధిలో ఉన్న షాపులలో ఒక ఏడాది పనిచేసి ఉండాలని, బార్బర్ షాపు ఏర్పాటుచేసే వారు నాయీ బ్రాహ్మణులు అయి ఉండాలని, షాప్ ఏర్పాటుచేసే వారు సంఘానికి రూ.10వేలు సభ్యత్వం చెల్లించాలని ఇతర తీర్మానాలను వివరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బొండపల్లి శివ, చీపురుపల్లి గణేష్, మల్లువలస సన్యాసిరావు, బొండపల్లి గణేష్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని

గుర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద సుహాసిని కొమరగిరి అన్నారు. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా స్థానిక అమ్మాజీ కల్యాణ మండపంలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని, మాట్లాడారు. భారతీయ జనసంఘ్‌ను ఆదర్శవంతమైన రాజకీయ పార్టీగా రూపొందించిన జాతీయ నాయకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు పతివాడ రాజేష్, వేమకోటి గిరిబాబు, నెల్లిమర్ల కౌన్సిలర్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాదు, చందక గోవిందు, కొండపల్లి శ్రీనివాసరావు, మహేష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష పూర్తిచేయాలి

నెల్లిమర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా 2002పై సమీక్ష ప్రక్రియను బీఎల్వోలు త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ కె.శ్రీకాంత్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని బీఎల్వోలతో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు ఆధ్వర్యంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా 2002 సమీక్ష, ఆ జాబితాలో 2005 ఓటర్ల జాబితా బేరీజు ప్రక్రియను శుక్రవారం నాటికి శతశాతం పూర్తిచేసి నివేదికలను తనకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురం ఆనకట్టకు జలకళ



ఎగువ నుంచి వరద నీరు రావడంతో పాటు మడ్డు వలస రిజర్వాయర్ నుంచి నీరు విడిచిపెట్టడంతో రంగా రాయిపురం వద్ద నారాయణపురం ఆనకట్ట జలకళ సం తరించుకుంది. ఆనకట్ట వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొనడంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది.

- సంతకవిటి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)

మా గోడు అసెంబ్లీలో వినిపించండి

- కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే లలితకుమారి అమ్మగారు.. మా గోడు అసెంబ్లీ సమావేశాల్లో వినిపించండి' అని జిందాల్ నిర్వాసితులు కోరారు. గురువారం బొడ్డవర గ్రామం వద్ద వారు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటికే శాసనమండలి ద్వారా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తమ పోరాటాన్ని వివరించారని అలాగే ఎమ్మెల్యే కూడా వివరించి తమ భూములు తమకు వెనక్కి వచ్చేలా చేయాలని వారు కోరారు. తమ సమస్యపై సీఎం, డిప్యూటీ సీఎం స్పందించాలన్నారు.



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

వృద్ధుడి హత్య

- భూ వివాదంతో కక్షగట్టి చంపేసిన తనయుడు


నాయుడు (ఫైల్)

బొండపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకిందాం గ్రామంలో తండ్రి హత్యకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెదమజ్జి నాయుడు(72)ను కుమారుడు గణేష్‌కుమార్ గునపాంతో పొడిచి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 15 రోజుల కిందట తండ్రీ కొడుకు మధ్య భూ వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో తండ్రి కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి గొడవలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో గణేష్‌కుమార్ పక్కనే ఉన్న గునపాం తీసుకుని తండ్రిని పొడిచేశాడు. రక్తపు మడుగులో తండ్రి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై అందిన సమాచారంతో ఎస్ఐ యు.మహేష్ గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు.

కాలువలో పడి తాపీమేస్త్రీ గల్లంతు

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ వర్రి మధు(25) గురువారం వెంగళరాయసాగర్ కాలువలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగి గల్లంతయ్యాడు. ఏఎస్ఐ బి.కొండలరావు తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లికి దాడయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు మధు వెంగళరాయసాగర్ కాలువలో స్నానం చేసేందుకు ఉదయం వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో సాయంత్రం 4 గంటల సమయంలో కుటుంబ సభ్యులు కాలువ గట్టుకు వెళ్లి పరిశీలించారు. కాలువ గట్టుపైన సైకిల్, అతడి దుస్తులు ఉన్నట్టు గుర్తించారు. మధు ఆచూకీ తెలియకపోవడంతో దాడయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ కటకం సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

గరుగుబిల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శివ్వాం గ్రామానికి చెందిన నల్లకాంతం దమయంతి (59) మృతి చెందింది. ఆమెకు మతిస్థిమితం లేదు. మూడు రోజులుగా దమయంతి కనిపించడం లేదని గరుగుబిల్లి ఎస్ఐ ఫక్రుద్దీన్‌కు ఆమె కుటుంబ సభ్యుడు చంద్రరావు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. చివరికి గురువారం ఉదయం శివ్వాం సమీపంలోని నాగావళి నదిలో మృతదేహం ఉందన్న సమాచారంతో ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆ మృతదేహం దమయంతి అని గుర్తించారు. మృతిరాలి భర్త జగన్నాథం 20 ఏళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమెకు మతి స్థిమితం లేకపోవడంతో పాటు మూర్ఛ వ్యాధి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

లక్కవరపుకోట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నపాలెం గ్రామానికి చెందిన వనుము ఈశ్వరరావు (57) తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. లింగంపేట గ్రామంలో పండగ కోసం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కుక్క అడ్డంగా రావడంతో ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో 2025 ఏప్రిల్ నెలలో నమోదైన పోక్సో కేసులో విజయనగరం పట్టణం మేదర వీధికి చెందిన గ్రంది పైడిరాజు(అలియాస్ రాజు)కు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి తీర్పును వెలువడించారు. అలాగే బాధితురాలికి పరిహారంగా రూ.2లక్షలు మంజూరు చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ స్టేడియం మేదర వీధికి చెందిన గ్రంది పైడిరాజు అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికపై ఈ ఏడాది ఏప్రిల్ 16న ద్విచక్రవాహనంపై వేరే ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ గోవిందరావు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయగా నిందితుడు పైడిరాజుపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయాధికారి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించారు. ఈ కేసులో క్రియాశీలంగా వ్యవహరించిన డీఎస్పీ గోవిందరావు, ఎస్ఐ నరసింగరావుతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పశువుల కాపరి మృతదేహం లభ్యం

మెంటాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మెంటాడకు చెందిన పశువుల కాపరి చల్ల కృష్ణ ఈనెల 23న ప్రమాదవశాత్తు చంపావతి నదిలో పడిపోయిన విషయం తెలిసిందే. ఈయన ఆచూకీ కోసం గత రెండు రోజుల నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు చేసిన ప్రయత్నాలు గురువారం ఫలించాయి. నది ప్రవాహం ఉధృతి కాస్త తగ్గడంతో కృష్ణ మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ భాస్కరరావు బాధిత కుటుంబానికి అప్పగించారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

కురుపాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలైన సందుబడి, తంబళబాయి, రేగులపాడు తదితర గ్రామాల్లోని సారా తయారీ కేంద్రాలపై రెండు రాష్ట్రాల ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. 730 లీటర్ల సారాతో పాటు తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. 9700 లీటర్లు బెల్లంఊటలు ధ్వంసం చేశారు. ఈసందర్భంగా కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా- ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా తయారీ చేసి ఆంధ్రాకు సరఫరా చేస్తున్నారన్నారు. దాడుల్లో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

కొత్తవలస, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. ఏదైనా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న వ్యక్తి మృతిచెందితే ఉదయం 10.30 నిముషాలకు కాకుండా సాయంత్రం 4గంటల తర్వాతే నివాళి అర్పించాలని ఆదేశాలు జారీ చేస్తూ హైకోర్టు సర్క్యులర్ జారీ చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ విధులను బహిష్కరించామని న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. ఈ మేరకు స్థానిక న్యాయాధికారి సముద్రాల విజయచందర్‌కు వినతిపత్రం అందజేశారు.

'కడుపు కోత' ఆగేనా?

(3వ పేజీ తరువాయి)

నుంచి డెలివరీల కోసం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులకు గర్భిణులు వస్తున్నారు. వీరి నుంచి అధికంగా నగదు వసూలు చేసి ఆపరేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో ఇప్పటికైనా ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

(3వ పేజీ తరువాయి)

భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 2వరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరీ, కమిషనర్ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

పట్టణ సమీపంలోని కొత్తవలస పరిధిలో ఉన్న జగనన్న లేఅవుట్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అవుట్‌లో 16 మంది పేదలకు స్థలాలు కేటాయించారని, కొంతమంది పెద్దలు వాటిని ఆక్రమించుకున్నారని వారు చెప్పారు. 12 మంది అన్యరులు ఇక్కడ కట్టడాలు నిర్మించినట్లు గతంలో అధికారులు గుర్తించినట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఇలా వదిలేస్తే ఆయా స్థలాలు అక్రమణకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రోన్ పోలీసింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట

(3వ పేజీ తరువాయి)

రవాణా నియంత్రణకు, పేకాట, ఓపెన్ డ్రింకింగ్, గంజాయి సేవించడం వంటి అసాంఘిక కార్యక్రమాలను నిలువ రించేందుకు ప్రతిరోజూ డ్రోన్ పోలీసింగ్ నిర్వ హించాలని ఆదేశించారు. నేరాల దర్యాప్తులో సాంకేతికతను జోడించి, పెండింగ్ కేసులను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. 'సుదీర్ఘ పెండింగ్ కేసుల దర్యాప్తును పూర్తి చేసి ఛార్జ్‌షీట్స్ కోర్టుకు సమర్పించాలి. గంజా యి, సారా, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న ముద్దాయిలను అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలి. పోలీసు స్టేషన్లలో నమో దైన ప్రతీ కేసు వివరాలను క్షుణ్ణంగా సీసీటీ ఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలి. హెల్మెట్ ధారణపై వాహనచోదకులకు అవగా హన కల్పించాలి. రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చే యాలి. మహిళా సంబంధిత నేరాలపై ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరపాలి. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో మహిళలపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. సైబర్ నేరాలపై, శక్తి యాప్, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.' అని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, సీఐలు శ్రీనివాస్, అప్పారావు, రమేష్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

పాలకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెయ్యిల వీధికి చెందిన క్రీడాకారుడు బెహరా శివదుర్గాప్రసాద్‌కు గురు వారం టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. శివదుర్గాప్రసాద్ పుట్టుకతోనే దివ్యాం గుడు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాడు. ఇటీవల శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు శివకుమార్ ఎంపిక య్యాడు. డిసెంబరు 15న జరగబోయే త్రోబాల్‌లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కొండరావు ఆర్థిక సాయం చేశారు.

ఘనంగా ఫార్మసిస్ట్ డే

పాలకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో గురువారం ఫార్మాసిస్ట్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మాసిస్టల సేవలను మెడికల్ సూపరింటెండెంట్ కె.చిరంజీవి కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ కె.రవికుమార్, వైద్యులు వాగ్దేవి, హరి, భారతి, శోభారాణి, రాజీవ్ పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించండి

కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి



పార్వతీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు తప్పనిసరిగా క్రీడలపై ఆసక్తి పెంపొందింపజేయాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పంచాయతీ రాజ్, స్పోర్ట్స్, సంక్షేమ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థి కనీసం మూడు క్రీడలను ఎంపిక చేసుకుని అందులో ప్రావీణ్యం సాధించాలన్నారు. ప్రతీ పాఠశాల, కళాశాలల్లో తరగతులు, క్రీడలు వారీగా విద్యార్థులను ఎంపిక చేసి బృందాలను సిద్ధం చేయాలన్నారు. రోజులో ఒక గంట సమయం క్రీడలకు కచ్చితంగా కేటాయించాలన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గి ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. బాల బాలికలకు అండర్ 10,12,14,17 కేటగిరిల్లో వేర్వేరుగా క్రీడలు నిర్వహించాలన్నారు. ఇందుకోసం శిక్షణ ఇప్పించాలన్నారు. అలాగే పంచాయితీ కార్యదర్శిల ద్వారా గ్రామాల్లో పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారి వివరాలు సేకరించి ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చేయించాలన్నారు. పార్వతీపురం, సీతంపేటలలో పీజీ సెంటర్లు, ఒక డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీసి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఐటీడీఏ ఏపీవో ఎ.మురళీధర్, జిల్లా పంచాయితీ అధికారి టి.కొండలరావు, డీఎస్‌డీవో కె.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి పాల్గొన్నారు.

గ్రామాల శుభ్రతే మన లక్ష్యం



చెత్తను ఏరుతున్న డీపీవో కొండలరావు,

జియ్యమ్మవలస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రతలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి శ్రమదానం చేశారు. ప్రతీ ఒక్కరు రోజుకు ఒక గంట శ్రమ దానం చేసి పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్, సర్పంచ్ ఈదల రాములు, ఎంపీటీసీ సభ్యుడు దత్తి శంకరరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్, పీఏసీఎస్ చైర్మన్ డి.సోములు పాల్గొన్నారు.

పాఠశాలలో శ్రమదానం

సాలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, బీసపు హైమావతి, మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్, మున్సిపల్ డీఈ ప్రసాదరావు ఉన్నారు.

●పాలకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయం ఆవరణలో గురువారం నగర పంచాయతీ సిబ్బంది స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకుంటున్నామని నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో డాక్టర్ల నిరసన

గరుగుబిల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యుడు తిరుమల ప్రసాద్ గురువారం నల్ల బ్యాడ్జీతో విధులకు హాజరయ్యారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని డాక్టర్ వినోద్‌కుమార్, రఘు తెలిపారు.

వారపు సంతలో వైద్య శిబిరం

కురుపాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కురుపాం సంతలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటైంది. రావాడ, రామభద్రపురం పీహెచ్‌సీల వైద్యాధికారి చీకటి శంకరరావు సంతకు వచ్చిన వారికి వైద్య సేవలు అందజేశారు. దాదాపు 113 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆదివాసీలను జలసమాధి చేయవద్దు

పాచిపెంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరిట ఆదివాసీలను జల సమాధి చేయవద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి అప్పలనరసయ్య అన్నారు. జీపు జాతరలో భాగంగా గురువారం తంగ్లాంలో అరణ్య గర్జన సమావేశం నిర్వహించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి చేస్తున్న సర్వేలను ఆపాలన్నారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు, ఎన్‌వై నాయుడు, మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, సర్పంచ్ ఎస్.రామయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

332 మందికి వైద్య పరీక్షలు

కురుపాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆసుపత్రిలో గురువారం మెగా వైద్య శిబిరం ఏర్పాటైంది. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా మహిళ కోసం నిర్వహించిన శిబిరాన్ని ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 332 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ హాజరయ్యారు.. ఆయనతో పాటు మరో 20 మంది రక్తదానం చేసారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

వెబ్ ల్యాండ్‌లో తప్పులు సరిచేయండి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

పార్వతీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ శాఖకు చెందిన సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి జేసీ రెవెన్యూ వెబ్ ల్యాండ్ కేసులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో తెలియజేయాలన్నారు. వెబ్ ల్యాండ్‌లో తప్పులు సరిచేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భూసమస్యలు ఉండరాదు

●జియ్యమ్మవలస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం తురకనాయుడువలస లో ఏర్పాటైన భూసమస్యల పరిష్కార వేదికకు జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ ఎల్‌పీఎంల సమస్యపై 35, వన్‌బీ కోసం 13, సవరణలు 9, ఎల్‌పీఎంలో యాడింగ్‌కు 4, భూవివరణ కొరెక్షన్‌లకు రెండు, కొత్త పట్టాలకు ఐదు, ఆధార్ తొలగింపు, డి పట్టా కోసం, డబుల్ ఖాతాల సమస్య కోసం ఒక్కొక్కటి చొప్పున మొత్తం 71 దరఖాస్తులను ఆయర స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన తహసీల్దార్ వై.జయలక్ష్మిని పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, సర్వేయర్లు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో రెడ్ అలర్ట్

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాలను ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం, కురపాం ఏజెన్సీ ప్రాంతంలో పోలీసులు రెడ్ అలర్ట్ విధించారు. ఎల్విన్‌పేట సీఐ హరి మాట్లాడుతూ మావోయిస్టు వారోత్సవాలు సందర్భంగా పోలీస్‌శాఖ అప్రమత్తంగా ఉందన్నారు. ఏవోబీ నుంచి వచ్చే వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు.ఎల్విన్‌పేట చెక్‌పోస్టులో నిఘా పెంచామన్నారు. ఎల్విన్‌పేట, కురపాం, పోలీస్‌స్టేషన్ పరిధిలో అప్రమత్తంగా ఉన్నామని సీఐ వెల్లడించారు.

నాగుపాము హల్‌చల్



పాలకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గారమ్మకాలనీ సచివాలయం సమీపంలో రెండో వీధిలోని రోడ్డుపై నిల్వ ఉన్న నీటిలో నాగుపాము గురువారం హల్‌చల్ చేసింది. పామును చూసి కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. కొద్దిసేపటికి ఆ సమీపంలోని పొదల్లోకి వెళ్లింది. నగర పంచాయతీ అధికారులు స్పందించి కాలనీలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని కోరారు.

కురుపాంలో కొండచిలువ

కురుపాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావాడ రోడ్డు జంక్షన్‌లోని నూరేల్లా చికెన్ దుకాణంలోకి బుధవారం రాత్రి కొండ చిలువ చొరబడింది. అందులో కోళ్లను తినేసింది. గురువారం ఉదయం దుకాణాన్ని తెరిచి సదరు యజమాని కొండ చిలువను చూసి భయాందోళనకు గురయ్యాడు.

భక్తులకు అసౌకర్యం కలగనీయవద్దు: ఎస్పీ

పాలకొండ,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కోటదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసులను ఆదేశించారు. గురువారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎస్పీని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ ఈవో సూర్యనారాయణ ఆయనకు ప్రసాదం అందజేసారు. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల రద్దీ, సౌకర్యాలు వంటి అంశాలపై ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీతో పాటు డీఎస్పీ రాంబాబు, సీఐ ప్రసాదరావు, ఎస్ఐ ప్రయోగమూర్తి ఉన్నారు.

అవినీతిని అంతం చేద్దాం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవినీతిని సమష్టిగా అంతం చేద్దామని ఏపీజీవీబీ పార్వతీపురం రీజనల్ మేనేజర్ అర్జునరావు అన్నారు. గురువారం నిఘా వారోత్సవాల్లో భాగంగా స్థానిక బైపాస్ రహదారిలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరం ముందుడాలన్నారు. అనంతరం పట్టణంలోని డీవీఎంఎం పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీజీవీబి రాష్ట్ర అధికారుల సంఘ ప్రధాన కార్యదర్శి జి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.